భగవాన్ ఉపదేశసారంలో ఏదైతే మనగతి అని చెప్పారో అదే నిజమైనగతి ఆగతిని పట్టుకోవటానికి అనుగుణంగా మన జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలి, దైనందిన జీవితంలో మన ప్రవర్తన దానికి అనుగుణంగా ఉండాలి. కాని మనం అదే నిజమైన గతి అనుకోవటం లేదు. ఆగతిని నిరోధించే పనులు చేస్తున్నాము మనమాట, మన తలంపు మన గతిని నిరోధిస్తున్నాయి. కొంతమంది ఏమనుకొంటున్నారు అంటే ఈ దేహం చనిపోయిన తరువాత స్మశానంలో దీనిని కాల్చివేస్తారు అంతటితో ఈ జీవితం ముగుస్తుంది అనుకొంటున్నారు. అలా ముగిస్తే సాధన అక్కరలేదు. అప్పుడు దేహానికి సంబంధించిన చరిత్ర ముగుస్తుందిగాని జీవుడికి సంబంధించిన చరిత్ర ఆగదు. జీవ లక్షణాలు ఉన్నంత వరకూ దేహం తరువాత దేహం వస్తూనే ఉంటుంది. నీవు గతిని పొందే వరకూ ఈ శవాలను మోయవలసిందే. అందువలన ఆగతిని పొందటానికి అనుగుణంగా మన ప్రవర్తనను తీర్చిదిద్దుకోవాలి పాయసం త్రాగేటప్పడు మనకు ఎలా ఉంటుందో భగవంతుని కళ్యాణగుణాలు విన్నప్పడు మనకు అలా ఉండాలి. దేవుడు ఎక్కడో ఉన్నాడు అనుకొంటున్నాము. భక్తివలన, శ్రద్ధ వలన, ప్రేమ వలన, అప్యాయత వలన ఎక్కడో ఉన్నాడు అనుకొనే దేవుడిని దింపుకోవాలి. నిన్ను పని చేయవద్దు అని చెప్పటం లేదు. అహంకారమును సంతృప్తిపరచే పనులు చేయవద్దు. ఈశ్వరుడు సంతోషించే పనులుచెయ్యి. ఈశ్వరుడు సంతృప్తి పడే పనులు చేస్తే ఈశ్వరుడుని పొందుతాము. మంత్రాన్ని జపించటం వలన రెండు లాభములు మీకు కాలక్షేపం అవుతుంది, భగవంతుని అనుగ్రహానికి పాత్రులవుతారు. దేవుడు తనకంటే భిన్నంగా లేడు అని తెలిసికూడా జ్ఞాని భగవంతుడిని గౌరవిస్తున్నాడు. అది జ్ఞాని యొక్క వైభవం కాని మనం అలాగ ఉండటం లేదు.

## (సఖినేటిపల్లిలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 15-2-98)

**ప్రియమైన ఆత్మబంధువులారా,**

అహంకారముతో మనకు ఉన్న సంబంధమును తొలగించుకోవటానికి చేసే ప్రయత్నమే సాధన. అహంకారముతో మనకు ఉన్న సంబంధము నశిస్తే హృదయంలో ఉన్న శాంతి మనకు దొరుకుతుంది. దైనందిన జీవితంలో మనం కుటుంబంలో ప్రవర్తించే తీరు, సమాజంలో ప్రవర్తించే తీరు ఎలా ఉందో చూసుకోవాలి. ఇతరులపట్ల మనకు ఉన్న అనుబంధములో అహంకారం లేకుండా చూసుకోవాలి. అహంకార రహితముగా మానవుడి ప్రవర్తన ఉంటే వాడికి తెలియకుండానే వాడి మనస్సు హృదయగృహలో రాలిపోతుంది. దైనందినజీవితంలో కొన్ని గంటలు పూజ, జపం, ధ్యానం చేసుకోవటం మంచిదే, మిగిలిన టైములో అహంకారముతో జీవిస్తే గజస్నానంలా ఉంటుంది. అంటే స్నానం చేసి మరలా బాడి చేసుకొన్నట్లు అవుతుంది. అహంభావన లేని జీవితం జీవించాలి. మన ప్రవర్తన అహంకార రహితముగా ఉంటే అహంకారరహిత జీవితం వస్తుంది. అహంభావన లేకుండా మానవుడి ప్రవర్తన ఉంటే ఆత్మ సాక్షాత్కారముదాని అంతట అదే కలుగుతుంది.

ఇప్పడు మనకు దేహమునందు నేను అనే బుద్ధి ఉంది. అలాగ చైతన్యమునందు, హృదయంలో ఉన్న ఏకరసం నందు నేను అనే బుద్ది కలిగితే మరల శరీరం అనే గుహలోనికి రానక్కరలేదు.

హృదయగుహలో ఉండి పోవచ్చును. హృదయగుహలోనికి ఎంతకాలం అయితే చేరుకోలేవో అంత కాలం శరీరం అనే గుహలోనికి రావలసిందే అంటే పునర్జన్మ తప్పదు. హృదయగుహలో స్థిరపడినవాడికి శరీరం అనే గుహలోనికి రానక్కరలేదు. నేను ముసలివాడిని అయిపోయాను అంటారు నేను ముసలిది అవ్వదు.దేహం ముసలిది అవుతుంది. దేహమేతాను అని భావించటం వలన నేను ముసలి వాడిని అయ్యాను అంటోంది. ఈ నేను నుండి విడుదల పొందటమే మోక్షం. ఈ దేహగతమైన నేను నుండి విడుదల పొందటానికే పూజ, జపం, ధ్యానం, సత్పురుషుల సహవాసం. ఉపనిషత్ వాక్యాలను, భగవంతుని మాటలను విశ్లేషణ చేసేటప్పుడు ఆ చెప్పే వ్యక్తికి చదువుతో పాటు తపస్సు ఉంటే ఆ మాటలు మీ అహంకారము యొక్క పొరలను చీల్చుకొని వస్తువు ఎక్కడ ఉందో అక్కడకు తీసుకొనిపోతాయి. అందువలన విద్య ఒక్కటే సరిపోదు, తపస్సు అవసరము. తపస్సు చేయటానికి దేహము యొక్క సహకారము, మనస్సుయొక్క సహకారము అవసరము, దేహము యొక్క సహకారము కావాలంటే దేహఆరోగ్యము సరిగా చూసుకోవాలి. అతిగా తినకూడదు, అతిగా మాట్లాడకూడదు, స్నేహాలు తగుమాత్రంగా ఉండాలి, అతి ఉండకూడదు. స్నేహాలు అతిగా ఉంటే రాగం ఏర్పడుతుంది. రాగం ఉన్నవాడు పాపం చేయకుండా ఉండలేడు. ఇప్పుడు అజ్ఞానం మనకు తియ్యగా ఉంది. తియ్యగా ఉన్న వస్తువును ఎలా విడిచిపెడతాము. మహాత్ముల దర్శనం వలన అజ్ఞానం మీద చేదు కలుగుతుంది. పొందవలసిన వస్తువు మీద తియ్యదనం కలుగుతుంది, కొంత మందికి జీవితం మీద ఏవగింపు ఉంటుంది. వారిని చూసి వారే అసహ్యించుకొంటారు. అది మంచిదికాదు. మనం పోజిటివ్‌గా జీవించాలి. నీవు పొందవలసినది ఏది, విడిచిపెట్టవలసినది ఏది అనే విచక్షణ మహాత్ముల దర్శనం వలన, కలుగుతుంది. నీవు ఒక మాట మాట్లాడితే, ఒక పనిచేస్తే అది నీకు జ్ఞానం సంపాదించుకోవటానికి సహకరించాలి, ఇతరులకు జ్ఞానం సంపాదించుకోవటానికి సహకరించాలి. అలా మన దైనందిన జీవితం ఉండాలి.

శరీరానికి అవసరాలు ఎలా ఉన్నాయో మనస్సుకు కూడా అవసరాలు ఉంటాయి. ఈ ఆధ్యాత్మిక ప్రవచనములు మనస్సుకు ఉన్న అవసరములను తీరుస్తాయి. అది గుర్తించే శక్తి లేక కొంతమంది లౌకికులు ఈ ప్రవచనముల వలన ప్రయోజనము ఏముంది అంటారు. సూక్ష్మంగా ఉండే ప్రయోజనంవారు గ్రహించలేరు. గ్రహించే శక్తిలేక వారు అలా మాట్లాడతారు. ఆ మాటలకు కంగారు పడవద్దు. ఒక మాట చెపుతున్నాను అనుకోండి. దాని యొక్క అర్థం నాకు తెలియనపుడు నేను దానిని ఆస్వాదించలేను. చెప్పేవాడికి రస హృదయం లేనప్పుడు వినేవాడికి రస హృదయం ఎలా కలుగుతుంది. మీకు ఎంత డబ్బు ఉన్నా విషయాలను చింతిస్తూఉంటే మీకు అశాంతి వస్తుంది. విషయాలలో అశాంతి ఉంది కాబట్టి విషయాలను చింతిస్తే అశాంతే వస్తుంది. దరిద్రుడు అయినా ఆత్మనుచింతిస్తే వాడికి శాంతి వస్తుంది. ఆత్మలో శాంతి ఉంది కాబట్టి ఆత్మనుచింతిస్తే శాంతి వస్తుంది. నాలుగు గంటలు ఉపన్యాసం చెప్పి మీ మనస్సును శరీరం చుట్టూ త్రిప్పుతున్నాము అనుకోండి ఇంక అది లోపలకు ఏమి వెళుతుంది. ఎక్కడయితే ఈశ్వరుడు ఉన్నాడో అక్కడకు మీ మనస్సును తీసుకొని వెళ్లేదే బోధ లేకపోతే అది బాధ.

భగవంతుని అనుగ్రహం లేకుండా నీవు ఎన్ని తంటాలుపడినా మనస్సు అంతర్ముఖం అవ్వదు. మనస్సుకు అంతర్ దృష్టి లేకపోతే అది హృదయగుహలోనికి వెళ్లదు. ఈ ప్రవచనములు విన్నంతసేపు అహంభావన తొలిగించుకోవాలి, అనుకొంటాము. ఇక్కడ నుండి బయటకు వెళ్లిన తరువాత దేనినైతే తొలగించుకోవాలి. అనుకొంటున్నామో దానికి నీరు పోసి పెంచుతాము. అహంభావనకు నీరుపోస్తాము అది ఎలా పోతుంది. అహంభావన లేకుండా ఎలా జీవించాలి అనే వివేకము ఈశ్వరానుగ్రహం లేకుండా కలుగదు. మనం లోపలకు ప్రయాణం చేయాలంటే ఎంతో పూర్వ పుణ్యం ఉండాలి. 24 గంటలు పొట్ట గురించే ఆలోచించేవారికి, శరీరం చుట్టూ తిరిగే వారికి తూకం ఎలా వస్తుంది, హృదయంలోనికి ఎలా దిగగలడు. హృదయంలోనికి దిగటానికి వాడికి బరువు సరిపోదు. మృత మనస్సుకే ఆత్మజ్ఞానం కలుగుతుంది. నీకు మృతమనస్సు కలగాలంటే చచ్చిన వాడిలా బ్రతుకు అన్నారు భగవాన్. ఏ భావాలు లేకుండా ఉన్నప్పుడు నీ మనస్సుకు అంతర్దృష్టి కలుగుతుంది. సమాధి స్థితిలో తాను ఉన్నాను అన్న సంగతి తనకు తెలుస్తూ ఉంటుంది, ఏ భావాలు, తలంపులు రావు, మనస్సుతో మనం సంపాదించేది అంతా మిధ్యా జ్ఞానమే. ఇప్పుడు మనకు ఉన్నది మిధ్యా జ్ఞానము దానినే ఆత్మజ్ఞానము అనుకొంటున్నాము. మిధ్యా జ్ఞానము ఆత్మ జ్ఞానము అవ్వదు.

గొడవలు కల్పించేది, అశాంతిని తీసుకొని వచ్చేది అశుద్ద మనస్సు. నీ మనస్సులో ఉన్న మాలిన్యములను తొలగించుకోవటానికే సాధన. లోపల ఉన్న వస్తువును కొత్తగా కనిపెట్టనక్కరలేదు. లోపలఉన్న వస్తువు అనుభవంలోనికి వచ్చిన తరువాత దేహము ఉన్నా ఆనందమే, దేహము లేకపోయినా ఆనందమే ఎందుచేతనంటే ఆ వస్తువులో ఉన్నదే ఆనందం. అశుద్ద మనస్సే సంసారం, మనస్సు అణిగే వరకూ సంసారం అణగదు. మనస్సు ఉన్నంతకాలం సంసారం మీద రుచిపోదు. మనస్సు నశిస్తే నీవు నశించవు. నీవు ఎవడో నీకు తెలస్తుంది. మనస్సే నీవు అనుకొంటున్నావు కాబట్టి మనస్సుపోతే నేనుపోతాను అనుకొంటున్నావు. ఏవస్తువును పట్టుకోవాలి ఏవస్తువును విడిచిపెట్టాలి అనే వివేకం లేకపోతే మనస్సుకు అంతర్ దృష్టి కలుగదు. ఆత్మకాని దానిని విడిచిపెట్టాలి, ఆత్మను పట్టుకోవాలి, ఆ వివేకం లేకపోతే కోటి జన్మలు ఎత్తినా నీకు జ్ఞానం కలుగదు. ఇందులో పెద్ద కష్టం ఏమీ లేదు. కష్టం, కష్టం అనేది కూడా ఒక తలంపే సూర్యుడిని చూడటానికి దీపం సహాయం అవసరం లేదు. నీ మొఖం అటు త్రిప్పితే చాలు అదే విధంగా నీలో జ్ఞానసూర్యుడు ఉన్నాడు. నీ మొఖం అటు త్రిప్పితే సూర్యుడిని ఎలా చూడగలుగుతున్నావో అలాగే బాహ్యంగా విజృంభిస్తున్న నీ మనస్సును ఒక్కసారి లోపలకు త్రిప్పితే ఆత్మయొక్క వెలుగులోనే ఆత్మను దర్శించవచ్చును. సాధన చేసి, సాధన చేసి గమ్యంచేరటం ఒక పద్దతి. సాధన చేసేవాడు ఎవడు అని విచారణ చేయటం ఒక పద్ధతి. సాధన చేసేవాడు ఎవడు అని ప్రశిస్తే సాధన చేసేవాడు ఉండడు, వాడు పత్తా లేకుండా పోతాడు. వస్తువును. పొందుతావు.

**(జన్నారులో శ్రీనాన్నగారి ప్రవచనము 19-4-98)**